# ఇండియన్ పాలిటీ

## భారత పార్లమెంటు

భారత ప్రజల అభిప్రాయాలు, ఆశలు, ఆశయాలకు ప్రతిరూపమైన సర్వోన్నత శాసన వ్యవస్థ భారత పార్లమెంటు. రాజ్యాంగంలోని V వ భాగంలో 79 నుంచి 122 వరకు ఉన్న రాజ్యాంగ నిబంధనలు పార్లమెంటు నిర్మాణం, అధికారాలు, విధులను వివరిస్తున్నాయి.

రాజ్యంగ నిబంధన 79 ప్రకారం భారత పార్లమెంటు అంటే రాష్ట్రపతి, రాజ్యసభ, లోక్‌సభ. రాష్ట్రపతి లోక్‌సభలోగాని, రాజ్య సభలోగానీ సభ్యుడు కాదు. అయినప్పటికీ పార్లమెంటులో అంతర్భాగం.

### పార్లమెంటు నిర్మాణం

భారత పార్లమెంటులో ద్విసభా విధానం ఉంటుంది. ద్విసభా విధానం భారత ప్రభుత్వ చట్టం 1919 ద్వారా కేంద్రంలో ప్రారంభమైంది. ఎగువ సభను రాజ్యసభ అనీ, కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ అనీ అంటారు. దిగువ సభను లోక్‌సభ అనీ, హౌస్ ఆఫ్ ది పీపుల్ అనీ అంటారు.

*రాజ్యసభ నిర్మాణం*

రాజ్యాంగంలోని 80 వ నిబంధన రాజ్యసభ నిర్మాణాన్ని తెలియజేస్తుంది. రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 250. ప్రస్తుత సభ్యుల సంఖ్య 245. అందులో ఎన్నికైన సభ్యులు 233 మంది, నియమించిన సభ్యులు 12 మంది ఉంటారు.

★ ఎన్నికైన వారిలో 229 మంది వివిధ రాష్ట్రాల నుంచి, నలుగురు కేంద్రపాలిత ప్రాంతాలైన దిల్లీ, పుదుచ్చేరి నుంచి ఎన్నికవుతారు. నియమించిన సభ్యులు "సాహిత్యం, సైన్స్, కళలు, సామాజిక సేవలు" మొదలయిన రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కలిగి ఉంటారు. వీరిని రాష్ట్రపతి నియమిస్తారు.

*లోక్‌సభ నిర్మాణం*

లోక్‌సభ నిర్మాణం గురించి రాజ్యాంగంలోని 81 వ నిబంధన తెలియజేస్తుంది. ఇందులో గరిష్ఠ సభ్యుల సంఖ్య 552. ప్రస్తుతం ఉన్న సభ్యుల సంఖ్య 545. అందులో ఎన్నికైన వారు 543 మంది, నియమించిన సభ్యులు ఇద్దరు. ఎన్నికైన వారిలో 530 మంది రాష్ట్రాల నుంచి, 13 మంది కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికవుతారు.

★ లోక్‌సభలో ఆంగ్లో ఇండియన్ వర్గానికి తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తే రాష్ట్రపతి ఇద్దరు ఆంగ్లో-ఇండియన్లను లోక్‌సభ సభ్యులుగా నియమిస్తారు. (ప్రస్తుత ఆంగ్లో ఇండియన్ సభ్యులు రిచర్డ్ హే, జార్జ్ బేకర్). షెడ్యూల్డు కులాలు (SC), షెడ్యూల్డు తెగలకు (ST) రిజర్వేషన్లు కల్పించారు. షెడ్యూల్డు కులాలకు 84 స్థానాలు, షెడ్యూల్డు తెగలకు 47 స్థానాలు రిజర్వు చేశారు.

*పార్లమెంటు–ఎన్నిక:*

రాజ్యసభ సభ్యులను రాష్ట్ర విధానసభ సభ్యులు ఎన్నుకుంటారు. ఎన్నిక పరోక్ష పద్ధతిలో బహిరంగ బ్యాలెట్ విధానం ద్వారా, ఒక ఓటు బదిలీ విధానం, ప్రాధాన్య క్రమాన్ని సూచించడం ఉంటాయి.

★ ఒక రాష్ట్రం నుంచి ఎన్నికయ్యే రాజ్యసభ సభ్యుల సంఖ్య ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి గరిష్ఠంగా 31 మంది, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మిజోరాం, సిక్కిం, నాగాలాండ్, త్రిపుర తదితర రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ఒక్కొక్క సభ్యుడు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారత పౌరుడు ఏ రాష్ట్రం నుంచైనా లేదా కేంద్రపాలిత ప్రాంతం నుంచైనా రాజ్యసభకు ఎన్నిక కావచ్చు.

★ లోక్‌సభ సభ్యులను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలు లేదా రిజిష్టర్డ్ ఓటర్లు ఎన్నుకుంటారు. ఎన్నిక రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. ఒక వ్యక్తి లోక్‌సభకు ఎన్నిసార్లైనా పోటీ చేయవచ్చు. ఒక రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాల సంఖ్య ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. గరిష్ఠంగా ఉత్తర్ ప్రదేశ్ నుంచి 80 మంది, కనిష్ఠంగా మిజోరాం, నాగాలాండ్, సిక్కిం నుంచి ఒక అభ్యర్థి చొప్పున ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

### పార్లమెంటు - అర్హతలు

★ రాజ్యాంగంలోని 84 వ నిబంధన పార్లమెంటు సభ్యుల అర్హతలను తెలియజేస్తుంది...

i) భారత పౌరుడై ఉండాలి.

ii) లోక్‌సభకు పోటీ చేయడానికి 25 ఏళ్లు, రాజ్యసభకు పోటీ చేయడానికి 30 ఏళ్లు నిండి ఉండాలి.

iii) పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు ఉండాలి.

★ రాజ్యాంగంలోని 102వ నిబంధన పార్లమెంటు సభ్యునిగా పోటీ చేయడానికి గల అనర్హతలను తెలియజేస్తుంది...

iv) లాభదాయకమైన ప్రభుత్వ పదవిలో ఉండకూడదు.

v) మానసిక స్థితి సరిగా లేదని కోర్టు ధ్రువీకరిస్తే పోటీ చేయడానికి వీలు లేదు.

vi) దివాలా తీసి ఉండకూడదు

vii) భారత పౌరసత్వం లేకపోవడం, విదేశీ పౌరసత్వం స్వీకరించి ఉండటం లేదా ఇతర దేశం పట్ల విధేయతను ప్రకటించిన వారు అనర్హులు.

viii) పార్లమెంటు చట్టం ప్రకారం పార్లమెంటు సభ్యత్వానికి అనర్హులు అయినవారు.

★ పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత సభ్యుని అనర్హతకు సంబంధించి పై ప్రశ్నలు తలెత్తితే రాష్ట్రపతి ఎన్నికల సంఘం అభిప్రాయాన్ని తీసుకుని (ఆర్టికల్ 103 (2)) దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**

www.eenadupratibha.net
www.eenadupratibha.net